నమస్తే తెలంగాణ
మెదక్
I | హైదరాబాద్, సోమవారం 27 జనవరి 2025 | MEDAK

కేసీఆర్ హయాం స్వర్ణయుగం

గజ్వేల్ దశాదిశ మార్చింది కేసీఆరే

పట్టణ ప్రగతిని ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు, చిత్రంలో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

- కేసీఆర్ కట్టించిన బిల్డింగ్‌లకు సున్నం వేసే దిక్కులేదు
- ఏడాదిలో పైసా పనిచేయని కాంగ్రెస్
- గజ్వేల్‌లో మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు

గజ్వేల్, జనవరి 26: పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో గజ్వేల్ దశాదిశను మార్చిన ఘనత కేసీఆర్‌కే దక్కిందని, కేసీఆర్ అద్భుతమైన భవనాలు కట్టిస్తే నేడు వాటికి సున్నం వేసే దిక్కు లేదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. ఆదివారం గజ్వేల్ మున్సిపల్ పాలకవర్గం అభినందన సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఏడాది పాలన చూసి విసుగు చెందిన ప్రజలు కేసీఆర్ కావాలని కోరుతున్నారని, తప్పకుండా రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమే అన్నారు. కేసీఆర్ హయంలో ఐదేండ్ల పాటు గజ్వేల్ బల్దియా పాలకవర్గం అద్భుతంగా పనిచేసిందని, కేసీఆర్ ఆశీస్సులతో గజ్వేల్‌ను అన్నిరంగాల్లో అభివృద్ధి చేసుకునే అశకాశం లభించిందన్నారు. ఈ ప్రాంతానికి తాగు, సాగునీరు అందించామని గుర్తుచేశారు. కేసీఆర్ సహకారంతో గజ్వేల్ చుట్టూ రింగ్‌రోడ్డు వచ్చిందని, కొద్దిగా పెండింగ్‌లో ఉన్న రింగ్‌రోడ్డును పూర్తి చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టిసారించడం లేదని హరీశ్‌రావు విమర్శించారు. గజ్వేల్ అంటే టూరిజం స్పాట్‌గా మారిందని, విద్య, వైద్యం, మార్కెట్, రైలు వచ్చాయన్నారు. ప్రజలకు ఎంత చేసినా కొంతైనా మిగిలి ఉంటుందని, కేసీఆర్ హయాంలో ప్రతి నెలా పల్లె, పట్టణ ప్రగతిలో నిధులు వచ్చేవని, ఇప్పుడు అవన్నీ బంద్ అయినట్లు తెలిపారు. దరఖాస్తులు చేసుకోవడం తప్పా ఒక్క సంక్షేమ పథకాన్ని ప్రజలకు ఇచ్చింది లేదన్నారు. పేదలకు నాణ్యమైన వైద్యం అందించాలనే ఉద్దేశంతో అద్భుతమైన దవాఖాన కట్టిస్తే దానికి తాళం వేశారన్నారు. కేసీఆర్ హయాంలో కట్టించిన భవనాలను అందుబాటులోకి తీసుకు రాలేకపోతునారని, ప్రభుత్వం ప్రజల కోసం పనిచేసేలా అందరూ ఒత్తిడి తేవాలని కోరారు. కేసీఆర్ కిట్, న్యూట్రీషన్ కిట్, దళితబంధు, బీసీబంధ అన్నీ బంద్ అయినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసులతో కేసులు పెట్టించడం ఏమీ చేయడం లేదని దుయ్యబట్టారు. అక్రమ కేసులకు బయపడేది లేదన్నారు. ఏడాది కాలంలో ఒక్క శిలాఫలకం వేసింది లేదన్నారు. వంద శాతం పంట రుణమాఫీ కాలేదని స్వయంగా మంత్రి దామోదర రాజనరసింహ ప్రకటించారని, కానీ.. సీఎం మాత్రం అందరికీ అయ్యిందని గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటని హరీశ్‌రావు విమర్శించారు. అనంతరం గజ్వేల్ మునిపాలిటీ పట్టణ ప్రగతిని హరీశ్‌రావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, టీఎస్ఐడీసీ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ సుధాకర్‌రెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ రోజారాధాకృష్ణాశర్మ, పన్యాల భూపతిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఎన్సీ.రాజమౌళి, వైస్ చైర్మన్ జకీయొద్దీన్, మాజీ ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, మాజీ జడ్పీటీసీ మల్లేశం, పార్టీ అధ్యక్షులు మధు, నవాజ్ మీరా, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి హరీశ్‌రావును సన్మానిస్తున్న చైర్మన్ రాజమౌళి, పాలకవర్గం సభ్యులు

ప్రొటోకాల్ విస్మరించిన అధికారులు



ప్రొసీడింగ్స్ పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకుడు పూజల హరికృష్ణ

నంగునూరు, జనవరి 26: అధికారిక కార్యక్రమాల్లో ప్రొటోకాల్ ఉల్లంఘనలు చోటుచేసుకుంటున్నాయి. కాంగ్రెస్ నాయకులు వేదికల మీద చేరి హల్‌చల్ చేస్తున్నారు. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నాగరాజుపల్లిలో ఆదివారం కాంగ్రెస్ నాయకుడు పూజల హరికృష్ణ ప్రజాపాలన గ్రామసభలో పాల్గొనడమే కాకుండా ప్రభుత్వ పథకాలకు సంబంధించి ప్రొసీడింగ్స్ పంపిణీ చేయడం చర్చకు దారితీసింది. ఎలాంటి ప్రొటోకాల్ లేని వ్యక్తి అధికారిక వేదిక పైన చేరి ఎలా ప్రొసీడింగ్‌లు పంపిణీ చేస్తాడని ప్రజలు ఆశ్చర్యానికి గురయ్యారు. అధికారులు ఎలా అనుమతించారని పలువురు బీఆర్ఎస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

గ్రామసభల్లో అధికారుల నిలదీత

- సంక్షేమ పథకాల్లో తమ పేరు లేదని ఆవేదన వ్యక్తం చేసిన మహిళలు

అర్హుల పేర్లు జాబితాలో లేవంటూ ప్రశ్నలు.. పోలీసు పహారా మధ్య లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేత

సిద్దిపేట: సిద్దిపేట రూరల్ మండలం వెంకటాపూర్‌లో అర్హుల పేర్లు జాబితాలో లేవని అధికారులను నిలదీస్తున్న గ్రామస్తులు

సిద్దిపేట, జనవరి 26: నాలుగు పథకాల అమలు కోసం రాష్ట్రవ్యాప్తంగా మండలానికి ఒక గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టు కింద ప్రభుత్వం ఎంపిక చేసిన విషయం తెలిసిందే. ప్రభుత్వ ఆదేశానుసారం గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆదివారం ఆయా గ్రామాల్లో లబ్ధిదారులకు అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రొసీడింగ్‌లు అందించారు. సిద్దిపేట నియోజకవర్గంలోని 5 మండలాల్లో ఐదు గ్రామాలను పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసి అదించారు. సిద్దిపేట రూరల్ మండలం వెంకటాపూర్‌లో నిర్వహించిన గ్రామసభలో భూములు ఉన్నవారికి ఇందిరమ్మ ఇండ్లు, ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు అందించారంటూ గ్రామస్తులు అధికారులను నిలదీశారు. లబ్ధిదారుల జాబితాను గ్రామసభలో చదవకుండా ఎలా ప్రొసీడింగ్స్ ఇస్తారని మహిళలు, యువకులు నిలదీశారు. తాను 30ఏండ్ల నుంచి పార్టీ కోసం పనిచేస్తే, తన పేరు లేకుండానే ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు చేశారని కాంగ్రెస్‌కు చెందిన మాజీ సర్పంచ్ ఎల్లయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. భారీ పోలీసు బందోబస్తు కల్పించినప్పటికీ గ్రామసభలో ప్రజలు అధికారులను నిలదీశారు. ఏ విధంగా లబ్ధిదారులను ఎంపిక చేశారో చెప్పాలంటూ మహిళలు ప్రశ్నల వర్షం కురిపించారు. సిద్దిపేట అర్బన్ మండలం ఎల్లుపల్లిలో జరిగిన గ్రామసభలో అధికారుల తీరు వివాదాస్పదమైంది. అధికారులకు అందించిన ప్రొసీడింగ్స్‌పై ఎలాంటి సంతకాలు లేకపోవడంతో గ్రామస్తులు అధికారులను నిలదీశారు. ముగ్గురికి మాత్రమే ప్రొసీడింగ్స్ అందజేసి కార్యక్రమాన్ని ముగించి వెళ్లిపోయారు. నారాయణరావుపేట మండలం మారిలో జరిగిన ప్రజాపాలన గ్రామసభలో రైతులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ పార్టీ అమలు చేయాలని రైతులు, మహిళలు నిలదీశారు. చిన్నకోడూరు మండలం మెట్‌పల్లిలో కొంత మందికి పథకాలు మంజూరు చేయడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్హులందరికీ పథకాలు అందించాలని గ్రామస్తులు, బీఆర్ఎస్ నాయకులు అధికారులకు వినతి పత్రం అందజేశారు.

తుక్కాపూర్‌లో రసాభసా

తొగుట, జనవరి 26: సిద్దిపేట జిల్లా తొగుట మండలంలో ఆదివారం ప్రొసీడింగ్ పత్రాలు పంపిణీ రసాభాసగా మారింది. తుక్కాపూర్‌లో నాలుగు సంక్షేమ పథకాలకు సంబంధించి కొందరికే ప్రొసీడింగ్ పత్రాలు అందజేయడంపై అధికారులను గ్రామస్తులు నిలదీశారు. దీంతో కార్యక్రమం రసాభాసగా మారింది. అనర్హులను పథకాలకు ఎంపిక చేశారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్హులకు పథకాలు అందించాలన్నారు.

పోసాన్‌పల్లిలో గ్రామస్తుల ఆందోళన

కొమురవెల్లి, జనవరి 26: సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండలం పోసాన్‌పల్లిలో ఆదివారం లబ్ధిదారులకు తెలంగాణ వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ సభ్యురాలు భవాని పథకాల ప్రొసీడింగ్ పత్రాలు అందజేశారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డుల ప్రొసీడింగ్స్ పత్రాల అందజేత సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు గ్రామస్తులు అనర్హులకు ప్రొసీడింగ్స్ పత్రాలు ఇచ్చారని, తమకు ఎందుకు రాలేదని అధికారులను ప్రశ్నించారు. దీంతో గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులకు, గ్రామస్తులకు మధ్య వాగ్వాదం జరిగింది. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి లక్ష్మీనారాయణ, ఎంపీడీవో శ్రీనివాసవర్మ, డిప్యూటీ తహసీల్దార్ వేణుగోపాల్, మండల వ్యవసాయాధికారి వెంకట్రావమ్మ పాల్గొన్నారు.

సిద్దిపేట: ఇందిరమ్మ కమిటీలో తనకు స్థానం కల్పించలేదంటున్న కాంగ్రెస్ మాజీ సర్పంచ్ ఎల్లయ్య

తొగుట: తుక్కాపూర్‌లో అధికారులను నిలదీస్తున్న గ్రామస్తులు

ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తా..

- కేసీఆర్ 73 శాతం పీఆర్‌సీ ఇచ్చారు
- నేడు పీఆర్‌సీ గడువు ముగిసినా ప్రస్తావనే లేదు
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు



సిద్దిపేటలో ఉద్యోగులను సన్మానిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు

సిద్దిపేట, జనవరి 26 : ఉద్యోగుల సమస్యలపై రానున్న అసెంబ్లీ సమావేశాల్లో బీఆర్ఎస్ పక్షాన ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. ఆదివారం రాత్రి సిద్దిపేటలోని పబ్లిక్ సర్వెంట్స్ భవన్‌లో పలువురు ఉద్యోగుల ఉద్యోగ విరమణ, ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. ఈ భవన్‌తో తనకెంతో అవినాభావ సంబంధం ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రిటైర్డ్‌మెంట్ డబ్బులు ఎప్పుడొస్తాయో తెలియడం లేదని, అంతా అయోమయం నెలకొన్నదన్నారు. వడ్డీతో సహా ఆరు వారాల్లోగా డబ్బులు చెల్లించాలని ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలిచ్చిందని, కానీ, ఉద్యోగులే రాష్ట్ర ప్రభుత్వం మీద హైకోర్టుకు వెళ్లాల్సిన దుస్థితి వచ్చిందన్నారు. ఉద్యోగస్తులకు ఒకటో తారీకు జీతం ఇస్తున్నామని గొప్పలు చెప్పి ఇవ్వడం లేదని విమర్శించారు. ప్రభుత్వం వచ్చిన 13 నెలల్లో ఒకరికి కూడా మెడికల్ బిల్లు వచ్చింది లేదన్నారు. లోన్లు వచ్చే పరిస్థితి లేదు.. పీఆర్‌సీ లేదు.. కేసీఆర్ హయాంలో రెండు విడతల్లో కలిపి 73శాతం పీఆర్‌సీ ఇచ్చి చరిత్ర సృష్టించారని హరీశ్‌రావు గుర్తుచేశారు. నేడు పీఆర్‌సీ గడువు ముగిసినా దాని గురించి ప్రస్తావన లేదన్నారు. డీఏల గురించి మాట్లాడే పరిస్థితి లేదన్నారు. లక్ష కోట్లతో మూసీ సుందరీకరణ, రూ. 40 వేల కోట్లతో మెట్రో రైలు అభివృద్ధి చేస్తామంటున్నారని, కానీ, రూ. వేల కోట్లతో ఫోర్త్ సిటీ కడుతాం.. ఇవన్నంటికీ డబ్బులు ఉంటాయి కానీ.. ఉద్యోగులకు డీఏలకు ఎందుకు డబ్బులు లేవు..? రిటైర్డ్ ఉద్యోగులకు డబ్బులు ఇవ్వడానికి చేతులు ఎందుకు రావడం లేదని ప్రభుత్వాన్ని హరీశ్‌రావు ప్రశ్నించారు. బెన్‌ఫిట్ డబ్బులు రావాలంటే ప్రభుత్వానికి 8శాతం లంచం ఇవ్వాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో... పదేళ్ల తెలంగాణ పాలనలో ఎప్పుడూ ఇటువంటి పరిస్థితి లేదన్నారు. గతంలోనే పీఆర్‌సీ కమిషన్‌ను కేసీఆర్ వేశారన్నారు. 5 శాతం ఐఆర్ ఇచ్చారన్నారు. కేసీఆర్ ఉద్యోగులకు మంచి గౌరవం ఇచ్చారన్నారు. ఈ ప్రభుత్వం వచ్చాక ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇటీవల ఒక మంత్రి కరీంనగర్‌లో మహిళా కలెక్టర్ పట్ల దురుసుగా ప్రవర్తించారో చూశామన్నారు. ఉద్యోగస్తులను అవమానపరిచే ప్రభుత్వం కాంగ్రెస్‌ది అన్నారు. 9 వేల మంది ఉద్యోగులు రిటైర్డ్ అయ్యారని, వారిలో ఒక్కరికి కూడా పెన్షన్ బెన్‌ఫిట్లు ఇవ్వడం లేదన్నారు. పెన్షన్ బెన్‌ఫిట్లు తప్పించుకోవడానికి ప్రభుత్వం 65 ఏండ్లకు ఉద్యోగ విరమణ వయసు పెంచుతామని కొత్త నాటకానికి తెరలేపిందన్నారు. కేసీఆర్ అప్పట్లో అలవెన్స్ ఇచ్చారన్నారు. నేడు ఎంపీడీవోలు, తహసీల్దార్లు వెహికల్ అలవెన్స్ ఎస్సైలకు స్టేషన్ అలవెన్స్ వస్తలేవన్నారు. సిద్దిపేటపై ప్రభుత్వం పగబట్టిందని హరీశ్‌రావు ఆరోపించారు. సిద్దిపేట ఉద్యోగస్తులకు వేతనం లాస్ట్‌కు వేస్తున్నదరని ఆరోపించారు. సిద్దిపేటకు వెటర్నరీ కళాశాల కొడంగల్‌కు పట్టుకెళ్లారన్నారు. సిద్దిపేటలో రెసిడెన్షియల్ మహిళా డిగ్రీ కళాశాలకు రూ.17 కోట్లు మంజూరు చేస్తే మెట్టుపల్లికి తీసుకెళ్లారని, రంగనాయకసాగర్‌లో టూరిజం ప్రాజెక్టుకు రూ.100 కోట్లు మంజూరు చేస్తే రూ, 20కోట్ల పని జరిగాక రూ. 80కోట్లు రద్దు చేశారన్నారు. కోమటి చెరువు వద్ద శిల్పారామం పనులు బంద్ చేసి మహబూబ్‌నగర్‌కు తీసుకెళ్లారని హరీశ్‌రావు విమర్శించారు. కార్యక్రమంలో టీఎన్‌జీవో అధ్యక్ష, కార్యదర్శులు గ్యాదరి పరమేశ్వర్, విక్రమ్‌రెడ్డి, పబ్లిక్ సర్వెంట్స్ భవన్ బాధ్యులు అయిత అంజయ్య, కల్లెపల్లి శ్రీనివాస్, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు పాల్గొన్నారు.

లష్కర్ వారం..పోటెత్తిన భక్తజనం

కొమురవెల్లి మల్లన్న ఆలయ రాజగోపురం వద్ద భక్తుల రద్దీ

చేర్యాల, జనవరి 26: కొమురవెల్లి మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆదివారం లష్కర్‌వారం సందర్భంగా క్షేత్రానికి సికింద్రాబాద్, కరీంనగర్, మెదక్, వరంగల్ తదితర పాత జిల్లాల నుంచి సుమారు 30వేల మంది వరకు భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ ఈవో రామాంజనేయులు తెలిపారు. పోతరాజుల విన్యాసాలు, బోనాలు, పట్నాలు, డప్పుచప్పుళ్లతో భక్తులు సందడి చేశారు. ఆదివారం వేకువజామునే పుణ్యస్నానాల అనంతరం భక్తులు గంటల పాటు క్యూలో నిలుచుండి స్వామివారిని దర్శించుకున్నారు. ఉదయం 5 గంటల నుంచి ప్రత్యేక దర్శనం, శీఘ్రదర్శనం, ధర్మదర్శనం ద్వారా భక్తులు ఆలయ అధికారులు దర్శన భాగ్యం కల్పించారు. ఆలయ పునరుద్ధరణ కమిటీ సభ్యులు, ఏఈవో, సూపరింటెండెంట్లు, అర్చకులు, ఒగ్గు పూజారులు, సిబ్బంది భక్తులకు సేవలందించారు. హైదరాబాద్‌కు చెందిన జైపాల్ దంపతులు మల్లన్నకు ప్రత్యేకంగా రుద్రాక్షలు, ఇలాచీలు, వైట్ జిల్లేడు, రెడ్ రోజ్, ఎల్లో రోజ్, మారేడు దళం, కిస్మిస్‌కాజు, ట్యూబ్ రోజ్ తదితర వాటితో స్వామి వారిని అలంకరించారు. ఆలయ ఆవరణలోని గంగరేగు చెట్టు ఆవరణలో పట్నాలు వేస్తున్న భక్తులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. పట్నాలు వేసే ప్రదేశానికి వీఐపీ దర్శనం క్యూలైన్ అనుకుని ఉండడంతో భక్తులు రూ.500 చెల్లించి టికెట్లు కొనుగోలు చేసి వెళ్లే సమయంలో అదే ప్రదేశంలో గూమిగూడి ఉండడంతో పట్నం వేసే భక్తులకు ఇబ్బందిగా మారింది. రేణుకా ఎల్లమ్మ ఆలయం వద్ద ఒక్కో కొబ్బరికాయ రూ.30 చొప్పున విక్రయించాల్సి ఉండగా, రూ.50 చొప్పున విక్రయించి సొమ్ము చేసుకున్నారు. లడ్డూ, పులిహోర కొనుగోలు చేసేందుకు ఏర్పాటు చేసిన ప్రసాదాల విక్రయశాల కౌంటర్ల వద్ద ఎలాంటి నీడ లేకపోవడంతో భక్తులు ఎండలో ఇబ్బందిపడ్డారు.

అందరికీ అవకాశాలు దక్కాలన్నదే లక్ష్యం

- గణతంత్ర దినోత్సవ వేడుకల్లో సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి



సిద్దిపేటలో స్వాతంత్ర్య సమరయోధులను సన్మానిస్తున్న కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేట/సిద్దిపేట అర్బన్, జనవరి 26: సమాజంలోని అన్నివర్గాలకు స్వేచ్ఛ, సామాజిక న్యాయం, సమాన అవకాశాలు దక్కాలన్న లక్ష్యంతో అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని సిద్దిపేట జిల్లా కలెక్టర్ మనుచౌదరి అన్నారు. ఆదివారం సిద్దిపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో జరిగిన గణతంత్ర వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల మంజూరుకు 2,30,483 దరఖాస్తులు స్వీకరించి వంద శాతం సర్వే పూర్తి చేసినట్లు తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమంలో భాగంగా జిల్లాలో రూ.36 కోట్లతో 840 పాఠశాలల్లో పనులు పూర్తి చేశామన్నారు. గీత వృత్తిదారులకు వారి భద్రత దృష్ట్యా ప్రభుత్వం మొదటి విడతలో 514, రెండో విడతలో 640 కాటమయ్య రక్షక కవచాలు మంజూరు చేసిందన్నారు. కల్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ పథకం కింద జిల్లాలో 5,007 దరఖాస్తులు రాగా, 2,658 దరఖాస్తులకు చెక్కులు పంపిణీ చేసినట్లు తెలిపారు. జాతీయ స్థాయిలో జరిగిన దేశవ్యాప్త పోటీల్లో సిద్దిపేట మున్సిపాలిటీకి బెస్ట్ క్లీన్‌సిటీ అవార్డు వచ్చినట్లు తెలిపారు. గంజాయి, డ్రగ్స్, కొకైన్ లాంటి మత్తు పదార్థాల రవాణా, విక్రయాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి మాదక ద్రవ్య రహిత జిల్లాగా ఏర్పాటు చేయడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణ, అసాంఘిక కార్యక్రమాల నిర్మూలన చేస్తూ పోలీసులు ప్రజలతో మమేకమయ్యేలా ఫ్రెండ్లీ పోలీస్ విధానాన్ని సమర్థవంతంగా అమలు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. గణతంత్ర వేడుకల్లో కలెక్టర్ మనుచౌదరి జాతీయ జెండా ఆవిష్కరించి జెండా వందనం చేశారు. అనంతరం పోలీసుల నుంచి గౌరవ వందనాన్ని స్వీకరించి జిల్లా అభివృద్ధిపై ప్రజలను ద్దేశించి ప్రసంగించారు. స్వాతంత్ర్య సమర యోధులు వెంకటాచారి, రంగు లింగయ్య, గొట్టిముక్కల లక్ష్మి, ఎస్.పద్మ, దేవుని కొమురయ్య, ఇమ్మడి రాందెడ్డి, ఇమ్మడి లింగారెడ్డి, సీహెచ్ లచ్చవ్వలను సీపీ అనురాధ, ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యతో కలిసి సన్మానించారు.

జర్నలిస్ట్ నుంచి ఎమ్మెల్సీ వరకు ప్రస్తానం

- మాజీ ఎమ్మెల్సీ సత్యనారాయణ మృతి
- నివాళులర్పించిన మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు

ఆర్.సత్యనారాయణ పార్థివదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

సంగారెడ్డి, జనవరి 26(నమస్తే తెలంగాణ): కొన్నిరోజులుగా ఇంట్లోనే చికిత్స పొందుతున్న తెలంగాణ ఉద్యమకారుడు, మాజీ ఎమ్మెల్సీ ఆర్.సత్యనారాయణ(60) ఆదివారం సంగారెడ్డిలో కన్నుమూశారు. ఏ రంగంలో ఉన్నా ఆయన తనదైన ముద్రవేశారు. మెదక్ జిల్లా కొల్చారం మండలం వరిగుంత గ్రామానికి చెందిన ఆర్.సత్యనారాయణ జర్నలిస్టుగా తన ప్రయాణాన్ని ప్రారంభించారు. ఉమ్మడి మెద క్, ఆదిలాబాద్, కడప, కర్నూలు, హైదరాబాద్‌లో జర్నలిస్టుగా పనిచేసి పీడిత ప్రజల పక్షాన నిలిచారు. 2001లో బీఆర్ఎస్‌లో చేరి తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పనిచేశారు. బీఆర్ఎస్ పొలిట్‌బ్యూరో సభ్యుడిగా, బీఆర్ఎస్ ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షుడిగా, సంగారెడ్డి నియోజకవర్గ ఇన్‌చార్జిగా పదవులు నిర్వహించారు. 2007లో కరీంనగర్ పట్టభద్రుల స్థానం నుంచి పోటీచేసి ఎమ్మెల్సీగా గెలుపొందారు. తెలంగాణ ఉద్యమంలో భాగంగా 2008లో ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశారు. 2014లో కేసీఆర్ మెదక్ ఎంపీగా పోటీచేసిన సమయంలో ఆయనకు ఎన్నికల ఏజెంట్‌గా వ్యవహరించారు. 2024 పార్లమెంట్ ఎన్నికలకు ముందు సిద్దిపేటలో సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఆయన అంత్యక్రియలు సంగారెడ్డి రాజంపేటలోని వైకుంఠధామంలో కుమారుడు నూతన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన మృతికి అధికార, ప్రతిపక్ష పార్టీలతోపాటు ఉద్యోగ, ఉపాధ్యాయ, జర్నలిస్టు సంఘాల నేతలు, సామాజిక ఉద్యమకారులు సంతాపం తెలిపారు. ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆర్.సత్యనారాయణ పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయనతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యేలు చంటి క్రాంతికిరణ్, భూపాల్‌రెడ్డిలు నివాళులర్పించారు. మండలి చైర్మన్ స్వామిగౌడ్, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు దేవీప్రసాద్, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్ ఆర్.సత్యనారాయణ పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీఎన్జీవో నేతలు కారం రవీందర్‌రెడ్డి, మామిళ్ల రాజేందర్‌లు ఆర్.సత్యనారాయణకు నివాళులర్పించారు. బీఆర్ఎస్ రాష్ట్ర నేతలు జైపాల్‌రెడ్డి, మఠం భిక్షపతి, ఆదర్శ్‌రెడ్డి, బాల్‌రెడ్డి, జిల్లా నాయకులు పట్నం మాణిక్యం, కాసాల బుచ్చిరెడ్డి, నరహరిరెడ్డి, మందుల వరలక్ష్మి తదితరులు నివాళులర్పించారు. మెదక్ ఎంపీ రఘునందన్‌రావు నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయన వెంట బీజేపీ నాయకులు దేశ్‌పాండే, రవి ఉన్నారు. కాంగ్రెస్ నేతలు నీలం మధు, సీఎం చీఫ్ పీఆర్వో ఆయోధ్యరెడ్డి, జర్నలిస్టు యూనియన్ రాష్ట్ర నాయకులు విరాహత్ అలీ, ఫైసల్, బండారు యాదగిరి, విష్ణు, పాత్రికేయులు నివాళులర్పించారు. బీఆర్ఎస్ మెదక్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి సంగారెడ్డిలో ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చి మనోధైర్యానిచ్చారు. ఆమె వెంట లావణ్యరెడ్డి, పట్లోరి రాజు ఉన్నారు.

పీసీసీ బృందం విచారణ

అమీన్‌పూర్, జనవరి 26: టీపీసీసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కమిటీ సభ్యులు ఆది శ్రీనివాస్, వినోద్‌రెడ్డితో పాటు డీసీసీ ప్రెసిడెంట్ నిర్మలా జగ్గారెడ్డి ఆదివారం అమీన్‌పూర్‌లో పర్యటించారు. స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్, నాయకులతో మాట్లాడి ఘటనపై పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇటీవల పటాన్‌చెరు కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలు బజారుకెక్కిన సంగతి తెలిసిందే. పటాన్‌చెరు కాంగ్రెస్ ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డికి వ్యతిరేకంగా సొంత పార్టీ నాయకులు ఇటీవల ఆందోళనకు దిగారు. మహిపాల్‌రెడ్డి మాకొద్దంటూ కాటా వర్గం పటాన్‌చెరులో బైఠాయించింది. ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్‌పై దాడికి పాల్పడగా, కమిటీ విచారణ చేపట్టింది.

రహదారి నిర్మాణం చేపట్టాలి

- అమీన్‌పూర్ పీపుల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ

ర్యాలీలో పాల్గొన్న పీపుల్స్ అసోసియేషన్ సభ్యులు

అమీన్‌పూర్, జనవరి 26: రహదారిని వెంటనే పూర్తి చేయాలంటూ అమీన్‌పూర్ పీపుల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం కాలనీవాసులు అమీన్‌పూర్ నుంచి శ్రీదేవి థియేటర్ వరకు ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా పీపుల్స్ అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ.. ఆరేండ్ల నుంచి తాము పడుతున్న ఆవేదన ప్రభుత్వానికి తెలవాలని ఉద్దేశంతో ర్యాలీ తీసినట్లు తెలిపారు. ప్రభుత్వం, స్థానిక ప్రజా ప్రతినిధులు చొరవ చూపాలని డిమాండ్ చేశారు.